RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

# అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 15 సంచిక : 290 సెప్టెంబర్ 6 ఆదివారం 2026 ప్రకాశం పేజీలు : 4 వెల - 2

## నా గురువు చేతిలో నేనూ

# దెబ్బలు తిన్నాను

విజయవాడ, సెప్టెంబర్ 5 : తాను చదువుకునే రోజుల్లో భక్తవత్సలం అనే ఉపాధ్యాయుడి చేతిలో దెబ్బలు తిన్నానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు ఉపాధ్యాయులుగా ఉన్న వారు కూడా దెబ్బలు తిన్నవాళ్లేనని పేర్కొన్నారు. నేడు విద్యార్థులు మరింత సుకుమారంగా మారిపోయారని చెప్పుకొచ్చారు. ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఈరోజు (శనివారం) విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

ఆ ప్రిన్సిపాల్‌ను దారుణంగా చంపేశారు..

మొన్న రంపచోడవరంలో ఓ అమ్మాయి బాగా మాట్లాడిందని.. ఆ తర్వాత చూస్తే ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. అంటే విద్యార్థుల్లో క్లాస్ రూమ్‌తో పాటు, బయట జరిగే పరిస్థితులు ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. మొన్న పదోతరగతి చదివే పిల్లలు ప్రిన్సిపాల్‌ను దారుణంగా చంపేశారని చెప్పారు. విజయనగరంలో ఫోన్ చూడవద్దంటే.. తల్లిని కూడా చంపేశారని ప్రస్తావించారు. విశాఖపట్నంలో టీచర్ హోంవర్క్ చేయలేదని కొడితే.. పిల్లాడు చనిపోయాడని అన్నారు. కొంతమంది పిల్లలు పరీక్షలు పాస్ కాలేమనే భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనం మారిన పరిస్థితులకు అనుగుణంగా సున్నితంగా ఉపాధ్యాయులు ఆలోచించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇక్కడ 175 మంది బెస్ట్ గురువులు ఉన్నారని ప్రస్తావించారు. ఏఐలో కూడా చాలా మార్పులు వస్తున్నాయని.. వాటిని కూడా గమనించాలని అన్నారు. టెక్నాలజీని అవైడ్ చేయలేరని... ఎవరైనా స్వీకరించాలి.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీచింగ్ ప్రొఫెషన్ ఇప్పుడు బాగా మారిపోయింది..

టెక్నాలజీతో కొత్త సవాళ్లు, కొత్త అవకాశాలు వస్తున్నాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏఐ వల్ల గురువు, విద్యార్థికి ఒకే సమాచారం వస్తోందని పేర్కొన్నారు. కానీ టీచర్‌కు ప్రత్యామ్నాయం మళ్లీ మరొక టీచరే మాత్రమేనని తెలిపారు. టెక్నాలజీతో అనేక కొత్త సవాళ్లు వచ్చాయని చెప్పుకొచ్చారు. 'టీచింగ్ ప్రొఫెషన్ ఇప్పుడు బాగా మారిపోయింది. నేను సీఎంగా బాధ్యత చేపట్టిన తర్వాత మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశాను. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే టీచర్ నియామకం ముఖ్యమని చెప్పాను. కోర్టుల్లో ఉన్న లిటికేషన్లను అధిగమించి మెగా



డీఎస్సీ నిర్వహించాం. ఏడేళ్లుగా ఎంతో కష్టపడి చదివిన వారికి ఉద్యోగాలు వచ్చాయి. మాతృదేవోభవ, పితృదేవోభవ.. ఆ తర్వాత ఆచార్య దేవో భవ అనేది మన సంస్కృతి. మన జీవితంలో తల్లిదండ్రుల తర్వాత మన జీవితాన్ని నిర్దేశించేది గురువులే. మనకు చదువు చెప్పిన టీచర్‌ను ఎప్పటికీ మర్చిపోలేం. మీ ముందు కూర్చున్న విద్యార్థుల్లో శాస్త్రవేత్త, క్రీడాకారుడు, ఉండొచ్చు.. వారిని గుర్తించి ప్రోత్సహించాలి. విద్యార్థులు ఎక్కువ సమయం స్కూల్లోనే ఉంటారు.. మీ ప్రభావం చాలా ఉంటుంది. మన పిల్లలు పుస్తకాలు చదవాలి, అదే సమయంలో ప్రపంచాన్ని కూడా చదవాలి. ఇవి నేర్పే ఏకైక వ్యక్తి ఆ స్కూల్లో ఉండే టీచరే మాత్రమేనని గుర్తుంచుకోవాలి' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఆ సమయంలో ఇంటర్నెట్ రెవల్యూషన్ వచ్చింది

'నేను ఈరోజు గురించి ఆలోచించను.. వచ్చే ముప్పై, నలభై ఏళ్ల గురించి ఆలోచన చేసి.. ఇప్పటి నుంచి పని మొదలు పెడతాను. నేను తొలిసారిగా సీఎం అయిన సమయంలో ఇంటర్నెట్ రెవల్యూషన్ వచ్చింది.

నేను అది గుర్తించి ఐటీని ప్రమోట్ చేశాను. మంత్రి నారా లోకేశ్ విదేశాల్లో ఉన్న సమయంలో ఫోన్ బిల్లు లక్షల్లో వచ్చేది. చైనాను స్టడీ చేసి.. నాకు ఉన్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించి కేంద్ర పెద్దలతో మాట్లాడాను. దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయ్ హయాంలో టెలి కమ్యూనికేషన్ సెంటర్‌లో డీ రెగ్యులేషన్ తీసుకువచ్చారు. ఆ ఒక్క నిర్ణయంతో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. నేడు ఏ మూలకు వెళ్లి తెలుగులో గట్టిగా మాట్లాడినా.. పది మంది మనవాళ్లు వస్తారు. నేడు హయ్యెస్ట్ ఇన్ క్యాపిటల్ చిరునామా తెలుగువారు' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు..

మా చదువులు వేరు.. ఇప్పుడున్న చదువులు వేరు..

'ఐటీ కూడు పెడుతుందా, సెల్‌ఫోన్ ఎవరికి కావాలి, పంపుసెట్ కావాలన్నారు. నేను సెల్‌ఫోన్ కావాలి, పంపుసెట్ కావాలని సమర్థించుకుని ముందుకెళ్లా. నేడు హైదరాబాద్ నాలెడ్జ్ ఎకానమీకి చిరునామా. మా చదువులు వేరు.. ఇప్పుడున్న చదువులు వేరు. అమెరికా అభివృద్ధి చెందిందంటే నాలెడ్జ్ ఉన్న వ్యక్తులను అక్కడకు ఆహ్వానించడం వల్లే సాధ్యమైంది. ఏషియన్ టైగర్స్ సింగపూర్, మలేషియాలు అభివృద్ధి చెందాయి. ఆ తర్వాత చైనా నలభై ఏళ్ల కృషితో అభివృద్ధి చెందింది. నేడు సాంకేతిక పరిజ్ఞానం ఎన్నో విధాలుగా అందుబాటులోకి వచ్చింది. పది, పదిహేనేళ్ల తర్వాత డిఫరెంట్ ఇండియాను మీరంతా చూడబోతున్నారు. అభివృద్ధి కోసం అనేక దేశాలు వంద, నలభై ఏళ్లు .. ఇరవై ఏళ్లల్లో మన దేశం అభివృద్ధి చెందుతుంది. 1990 ముందు కమ్యూనిజం, సోషలిజం అని మాట్లాడే వాళ్లం. ఆ తర్వాత పోటీతత్వం వచ్చింది.. అభివృద్ధి సాధ్యమైందని... కానీ విలువలు పడిపోయాయి' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఫోన్ లేకుండా ఉండలేక పోతున్నారు..

'భర్త లేకుండా భార్య, భార్య లేకుండా భర్త ఉంటున్నారు.. కానీ ఫోన్ లేకుండా మాత్రం ఎవరూ ఉండలేక పోతున్నారు. టెక్నాలజీ, స్పిరిచువాలిటీ.. ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చు. కొత్తగా వస్తున్న మార్పులపై డిబేట్, డిస్కషన్ జరగాలి. ప్రపంచంలో భారతదేశ సంస్కృతి ది బెస్ట్. కుటుంబ వ్యవస్థ, మంచి చెడులను విశ్లేషించేది మన సంస్కృతే. ఎడ్యుకేషన్ పూర్తి అయినా.. కొత్తగా వారిని ట్రైన్ చేసుకునే పరిస్థితి మన రాష్ట్రం లో ఉంది. ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, డేటా సెంటర్ వంటివి అనేకం వస్తున్నాయి. మరోవైపు ఫార్మా పెద్ద ఎత్తున డెవలప్ అవుతుంది. లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ వంటివి వృద్ధి చెందుతు న్నాయి. లోకేశ్ విద్యాశాఖ తీసుకుంటానని చెప్పినప్పుడు నేను కూడా చాలా ఆలోచించా. నాలెడ్జ్ ఎకానమీగా తీసుకుని అభివృద్ధి చేస్తానని ఆయన చెప్పిన మాటలకు నేను ఆనందపడ్డాను. మరో 25 సంవత్సరాల్లో జనాభా పెరిగే దేశం ఒక్క భారతదేశమే. ఉత్తర భారతదేశంలో జనాభా పెరుగుతుంది.. దక్షిణ భారతదేశంలో కూడా ఇది జరగాలి. టీచర్లు కూడా ఈ అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. ఒకనాడు ఎయిడ్స్ గురించి నేనే మాట్లాడాను.. ఇప్పుడు జనాభా తగ్గిపోకుండా చూసుకోవాలి' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# క్విస్ విద్యాసంస్థల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**- డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కి నివాళులు**

**- ఉపాధ్యాయులకు ఆటల పోటీలు, బహుమతుల ప్రదానం**



ఒంగోలు, అక్షర ప్రకాశం : ఒంగోలులోని క్విస్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. క్విస్ పబ్లిక్ స్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులకి ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు పుష్పాలు, గ్రీటింగ్ కార్డులు ఇచ్చి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఎంసీఏ హెచ్ వోడీ డాక్టర్ కొండల రావు ముఖ్య అతిథిగా హాజరయ్యి... ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ డాక్టర్ సత్య మెహర్ పాల్గొని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని క్విస్ కళాశాలలోని పీడీసీ విభాగం పర్యవేక్షించింది. కార్యక్రమంలో డీన్ ప్లానింగ్ ప్రొఫెసర్ చల్లారామ్, వివిధ విభాగాల డీన్ లు, డైరెక్టర్లు, హెచ్ వోడీలు పాల్గొన్నారు.





# శ్రీకృష్ణుని లీలలు వినోదాత్మకమే కాదు విజ్ఞానమయం

**- డా. చల్లా నాగేశ్వరమ్మ - వేడుకగా కృష్ణ జన్మాష్టమి**

**- భక్తి సంగీత విభావరిలో అలరించిన గీతాలు**

ఒంగోలు, అక్షర ప్రకాశం : శ్రీకృష్ణుని లీలలు కేవలం వినోదాత్మకమైనవి మాత్రమే కావని, వాటిలో మానవ జీవన విధానాన్ని మెరుగుపరిచే ఎన్నో విజ్ఞాన, ఆధ్యాత్మిక సందేశాలు దాగి ఉన్నాయని డా. చల్లా నాగేశ్వరమ్మ పేర్కొన్నారు. పరమాత్మ మానవ రూపంలో అవతరించి, మానవులలోని అజ్ఞాన అంధకారాన్ని తొలగించి వారిని కార్యోన్ముఖులను చేయ డంతో పాటు స్నేహం, ప్రేమ, సౌభ్రా తృత్వం వంటి మానవీయ విలువలను బలోపేతం చేశారని ఆమె వివరించారు. దేవకీ, వసుదేవుల కుమారుడిగా చెరసాల లో జన్మించిన శ్రీకృష్ణుడు, అనంతరం రేపల్లెలో యశోద, నందరాజుల వద్ద పెరిగి తన బాల్య లీలల ద్వారా ప్రజలకు అనేక జీవన సందేశాలను అందించారని తెలిపారు. ఒంగోలు సత్యనారాయణపురం లోని రామాలయం వీధిలో గల శ్రీ అనంత



కోదండ రామస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శు క్రవారం సాయంత్రం ఘంటసాల సంగీత సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంగీత విభావరి, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. చల్లా నాగేశ్వరమ్మ కార్యక్రమంలో ప్రసంగించడంతో పాటు భక్తి గీతాలను ఆలపించారు. బాలకృష్ణుని జన్మధారణ విశేషాలు, ఆయన లీలల్లోని ఆధ్యాత్మిక అంతరార్థాలను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వేమూరి శ్రీనివాసులు, పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి ఆర్గనైజర్ చల్లబాలకొండయ్య, గాయని, గాయకులు తాళ్లూరి శ్రీదేవి, చల్లా నాగేశ్వరమ్మ, డి. కోటేశ్వరరావు, రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు. కృష్ణ జన్మాష్టమి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, శ్రీకృష్ణుని లీలలు, ఆయన అందించిన ఆధ్యాత్మిక సందేశాలను తెలుసుకున్నారు. అనంతరం ఆలయ సిబ్బంది భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

# సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**- గురువులే విద్యార్థుల భవిష్యత్ రూపశిల్పులు: ప్రిన్సిపాల్ జగదీష్‌బాబు**

**- ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం**

**- రాధాకృష్ణన్ సేవలను కొనియాడిన కళాశాల ప్రతినిధులు**



చీరాల, అక్షర ప్రకాశం : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఐఎస్‌టీఈ స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**గురువులే విద్యార్థుల భవిష్యత్ రూపశిల్పులు**

సభలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జగదీష్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శ ఉపాధ్యాయుడిగా, ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలను కొనియాడారు. 'గురు' అంటే అజ్ఞానం అనే చీకటిని తొలగించి జ్ఞాన జ్యోతిని వెలిగించేవారని పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాలను ప్రేమాభిమానాలతో తీర్చిదిద్ది, వారిని ఉన్నత స్థానాలకు చేర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.

**ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర**

విద్యార్థి-ఉపాధ్యాయుల బంధం విడదీయరానిదని, తల్లిదండ్రుల తర్వాత విద్యార్థి వ్యక్తిత్వ వికాసంలో గురువుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ఆధునిక సమాజంలో ఉపాధ్యాయుల ప్రాధాన్యాన్ని వివరించారు. విద్యార్థులను బాధ్యతాయుతమైన, ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల సేవలు మరువలేనివన్నారు ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీఈ చాప్టర్ ఇన్‌చార్జి పి.వి.ఎస్. శర్మ కార్యక్రమానికి కన్వీనర్‌గా వ్యవహరించారు. డైరెక్టర్ (అక్రిడిటేషన్స్) డాక్టర్ సి.ఎస్. రావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి. రమణమూర్తి, డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) వనమా దొర నాగ సాయినాథ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షర ప్రకాశం
ఆదివారం 6 - 9 - 2026

# గురుపూజోత్సవం 2026 ప్రకాశం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



ఒంగోలు, అక్షర ప్రకాశం : గురుపూజోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా ఒంగోలు గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ఆడిటోరియం జరిగిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు మహిళా కళాశాల కోరు ఉప్పలపాడు కొండేపి మండలం నందు పిజిటి కెమిస్ట్రీ లెక్చరర్‌గా పని చేయుచున్న కొనిజేటి వెంకట శేషారావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కింది. కొణిజేటి వెంకట శేషారావు గత 31 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. ముఖ్యంగా కొండేపి మండలంలోని ముప్పవరం, కోరు ఉప్పలపాడు జిల్లా పాఠశాలలో గతంలో 18 సంవత్సరాలు పనిచేసే ఉన్నారు.

అదేవిధంగా మండలంలో కోయవారిపాలెం ప్రాథమిక పాఠశాలలోను మరియు మండల రిసోర్స్ పర్సన్‌గా ఐదు సంవత్సరాల పని చేసి ఉన్నారు. ఆయన పనిచేసిన కాలములో ఆరు ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలగా మూగచింతల, తాటాకుల పాలెం, జార్లపాలెం, కట్టుబడిపాలెం, రేగుల గడ్డ పాలెం, నెన్నూరుపాడు. Upgrade చేసినారు. గౌరవ మాజీ మంత్రివర్యులు దామచర్ల ఆంజనేయులు సహాయ సహకారంతో 1998-2002 సంవత్సరములో మండల రిసోర్స్ పర్సన్ గా పనిచేస్తూ మండలంలో 26 స్కూల్ బిల్డింగులు కట్టించినారు. ముప్పవరం, కోరు ఉప్పలపాడు, కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన కాలములో ఆయా పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేసినారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ భాగంగా మొక్కలు నాటడమే కాకుండా వాటిని 150 పైగా వృక్షాలుగా మలిచారు. ఆయన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ లో శిక్షణ పొందటమే కాకుండా జిల్లాలో మొట్టమొదటిగా జాతీయస్థాయిలో హిమాలయ వుడ్ బ్యాడ్జ్ కోర్స్ నేషనల్ హెడ్ క్వార్టర్స్ పచ మడి మధ్యప్రదేశ్ రాష్ట్రం నందు శిక్షణ పూర్తి చేసి ఉన్నారు. స్కౌట్ లో రాష్ట్రీయ, జాతీయస్థాయిలో ఎన్నో పురస్కారాలు పొంది ఉన్నారు. తన శిక్షణలో నేతాజీ స్కౌట్ ట్రూప్ విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో రాజ్య పునస్కార్ (గవర్నర్) సర్టిఫికెట్స్, జాతీయ స్థాయిలో జరిగిన 18 వ నేషనల్ జంబూరి పాలి రాజస్థాన్ రాష్ట్రంలో జరిగిన పోటీలలో విశేష ప్రతిభ కనబరిచి ప్రతిభా పురస్కారాలు పొందినారు. ఆయన స్కౌట్ విద్యార్థులకే కాకుండా, స్కౌట్ ఉపాధ్యాయులు కూడా శిక్షణ ఇచ్చి ఉన్నారు. ఆయన ప్రస్తుతం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రకాశం జిల్లా ట్రైనింగ్ కమిషనర్ స్కౌట్స్‌గా, యువ ఆపద మిత్ర జిల్లా కోఆర్డినేటర్‌గా పని చేస్తూ స్కౌట్ జిల్లా అభివృద్ధికి ఎంతో పాడుతున్నారు. ఆయన సమాజ సేవలో చురుగ్గా పాల్గొంటూ జిల్లా సేవా భారతి సెక్రటరీ కూడా ఉన్నారు. ఆయన జిల్లాలోని స్లమ్ ఏరియాలలో ని విద్యార్థుల అభివృద్ధికి వివిధ దాతల సహాయ సహకారంతో 40 ట్యూషన్ పాయింట్లు ఏర్పాటు చేసి వారి విద్యార్థుల అభివృద్ధికి విశేష కృషి చేసినారు ఆయన ప్రేరణతో ఎంతోమంది మరణాంతరం నేత్రదానం చేయడం కూడా జరిగింది. బ్లడ్ డొనేషన్ క్యాంప్స్ నిర్వహించి ఆపదలో ఉన్న ఎంతో మందికి రక్తదానం ఇప్పించడం జరిగింది. ఆయన నిరంతరం పాఠశాల అభివృద్ధికి, క్రీడలు అభివృద్ధికి మూడు లక్షల పైగా డబ్బులు వెచ్చించడం జరిగింది ఆయన ఆయన దగ్గరఅభ్యసించిన విద్యార్థులందరూ నేడు సమాజంలో డాక్టర్లుగా, ఇంజనీర్లు గా, రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నత పదవుల్లో ఉన్నారు. ఆయనకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి సుసన్న కుమార్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రాఘవ శర్మ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఆయనను అభినందించడమే కాకుండా ఘన సన్మానం చేయడం జరిగింది.

# వాసవి క్లబ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం







ఒంగోలు, అక్షర ప్రకాశం : తల్లిదండ్రులు జన్మనిస్తే, మనిషిని సమాజంలో ఉన్నత వ్యక్తిగా తీర్చిదిద్దే శక్తి గురువులకే సొంతమని వాసవి క్లబ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షులు శిఖకొల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. వాసవి క్లబ్స్ వ్యవస్థాపకులు స్వర్గీయ కల్వకుంట్ల చంద్రసేన గుప్త జయంతి వారోత్సవాల్లో భాగంగా, అంతర్జాతీయ అధ్యక్షులు శిద్దా వెంకట సూర్యప్రకాష్ రావు పిలుపుమేరకు సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురుపూజోత్సవాన్ని నిర్వహించారు.

కార్యక్రమ ముఖ్యాంశాలు:

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం: సొంతపేటలోని డి ఆర్ ఆర్ యం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పథకమూరి వెంకట్రావును క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అవగాహన సదస్సు: పండ్లమెట్లలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు చదువు, విజ్ఞానం మరియు భవిష్యత్ అవసరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సెనగపల్లి నాగాంజనేయులు, కోశాధికారి వలేటి ఠాగూర్, పూర్వ అధ్యక్షులు చీదెళ్ల వెంకటప్రసాద్, భూమా శ్రీనివాసులు, మద్దాలి శివప్రసాద్, ఊటుకూరు మహేష్‌లతో పాటు పాఠశాల విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు నిరంతరము ప్రవహించే సెలయేరులాంటివారు

## - బి.ఏ & కే.ఆర్ కళాశాలలో ఘనంగా గురుపూజోత్సవం

మద్దిపాడ, అక్షర ప్రకాశం : స్థానిక బి.ఏ �డ కే.ఆర్ కళాశాలలో శనివారం గురుపూజోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యా సంస్థల అధినేతలు బెల్లంకొండ విజయలక్ష్మి, డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు విచ్చేశారు. ముందుగా వారు భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేతలు మాట్లాడుతూ... డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని కొనియాడారు. “ఒక సాధారణ కుటుంబంలో జన్మించి, తన అపారమైన జ్ఞానంతో విశ్వవిద్యాలయ ఉపకులపతిగా, రాజనీతిజ్ఞునిగా, భారతదేశ అత్యున్నత రాష్ట్రపతి పదవిని అలంకరించిన మహోన్నత వ్యక్తి సర్వేపల్లి. ఆయన భారతదేశ కీర్తిప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పిన యుగపురుషుడు” అని కొనియాడారు. అనంతరం వారు ఉపాధ్యాయుల విశిష్టతను వివరిస్తూ... “ఉపాధ్యాయులు నిరంతరము ప్రవహించే సెలయేరులాంటివారు. సెలయేటిలో పాత నీరు పోయి కొత్త నీరు ప్రవహించినట్లే, అధ్యాపకులు కూడా పాత పరిజ్ఞానానికే పరిమితం కాకుండా ఎప్పటికప్పుడు సమాజంలో వస్తున్న నూతన మార్పులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సేకరించి, కొత్త జ్ఞానాన్ని ఆర్జించాలి. ఆ నూతన విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి” అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణ రాజశేఖర్, అధ్యాపకులు జి.వి. సుబ్బమ్మ, ఐ. సాయి చరిత, ఎస్. కవిత, షేక్ షమ్మీర్, టి. అనిల్, ఎస్. వనజ, ఎస్. కోటేశ్వరమ్మలతో పాటు పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





అక్షర ప్రకాశం

ఆదివారం 6 - 9 - 2026

# గురువులే ఆలోచనలను ఆచరణ వైపు నడిపించే మార్గదర్శకులు

- కలెక్టర్ పి. రాజాబాబు
- విద్యార్థుల సమగ్ర ఎదుగుదలలో గురువుల పాత్ర కీలకం
- ప్రజాసేవ వైపు నడిపించిన గురువుల సూచనలు
- లీప్ యాప్‌తో విద్యార్థుల ప్రతిభపై నిరంతర పర్యవేక్షణ
- పదో తరగతి ఫలితాల్లో ప్రకాశం జిల్లాకు నాలుగో స్థానం
- 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- 72 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ఒంగోలు, అక్షర ప్రకాశం : విద్యార్థుల ఆలోచనలను ఆచరణ వైపు మళ్లించే మార్గదర్శకులు గురువులేనని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని ప్రభుత్వ ఆసుపత్రి ఆడిటోరియంలో జిల్లాస్థాయి గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పి. విజయ్‌కుమార్, ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ షేక్ రియాజ్, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డితో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సమగ్ర ఎదుగుదలలో గురువుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. తాను చదువుకునే రోజుల్లో విదేశాలకు వెళ్లాలనే కోరిక ఉండేదని, అయితే విదేశాల్లో కంటే ప్రభుత్వ ఉద్యోగం ద్వారా ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఉంటుందని తన గురువులు సూచించారని గుర్తుచేశారు. మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందన్నారు. లీప్ యాప్ ద్వారా విద్యార్థుల ప్రతిభను ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోందని తెలిపారు. ఉపాధ్యాయులు బోధనపై మరింత దృష్టి సారించడం వల్ల ఈ ఏడాది పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రకాశం జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సవాళ్లతో కూడిన విద్యాశాఖను మంత్రి నారా లోకేశ్ సమర్థంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చేలా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న సంస్కరణలే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాఠశాలల ముందు 'నో అడ్మిషన్' బోర్డులు ఏర్పాటు చేసే పరిస్థితి రావడం విద్యాశాఖలో సాధించిన పురోగతికి నిదర్శనమన్నారు. పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ షేక్ రియాజ్ మాట్లాడుతూ జీవిత పాఠాలను నేర్పేది గురువులేనన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న గురువులు సదా స్మరణీయులన్నారు. మాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పి. విజయ్‌కుమార్ మాట్లాడుతూ నిపుణులు, నిధులు పుష్కలంగా ఉన్నది ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసిందని, ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి తప్పించిందని గుర్తుచేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి. రేణుక అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 72 మంది ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టర్, ఎంపీ, ఇతర ప్రముఖులు ఘనంగా సన్మానించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ విద్యాధికారులు రవి, రంగయ్య, సమగ్ర శిక్ష ఏపీసీ అనిల్‌కుమార్, డీసీఈబీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.
















Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,